క్లుప్తంగా

1200 మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



మజ్జిగ పంపిణీ చేసిన గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు

కాకినాడ: అన్నార్తులను ఆదుకునే దిశగా గుడ్ ఫ్రెండ్స్ చారిటీ ముందుకు వెళుతోందని ఆ సంస్థ అడ్మిన్ పి.నాగచక్రం గురువారం అన్నారు. కాకినాడలోని ప్రభుత్వ ఆసుపత్రి, డైరీ ఫాం సెంటర్ ప్రాంతాల్లో గుడ్‌ఫ్రెండ్స్ చారిటీ 1200 మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసింది. ఫేస్‌బుక్‌లో చిన్న గ్రూప్‌గా ప్రారంభమైన ఆ మిత్రులు నేడు వేలాది మందిని కలిగి సేవా కార్యక్రమాలు చేపడుతోంది. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, సుమ, హేమంత్, రాజమహేంద్రవరానికి చెందిన ఆంజనీలక్ష్మి, అంజనీకుమారి, స్వీటీ, సుజాత, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ వైశ్య ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం

బోట్‌క్లబ్: ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో గురువారం స్థానిక చిట్టూరివారి వీధిలో వాసవీ వైశ్య ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బీజేపీ నాయకులు పైడా వెంకటనారాయణ సౌజన్యంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేసి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ మాట్లాడుతూ ఎండలకు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ పనుల మీద బయటకు వచ్చిన ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి వీరేంద్ర, పైడిమల్ల చెరియన్ పాల్గొన్నారు.

రేపు హనుమజ్జయంతి పూజలు

బోట్‌క్లబ్: హనుమజ్జంతి సందర్భంగా స్థానిక గోడారిగుంట జర్నలిస్ట్ కాలనీలోని దాసాంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు యాతగిరి పరశురామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారుజాము 4 గంటల నుంచి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి 9 గంటలకు మహా మంగళ హారతితో పూజలు పూర్తవుతాయన్నారు. మధ్వ పురహితులు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర పూజ తమల పాకులతో అలంకరణ, అష్టోతర పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి, ఇంటర్మీయెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఆరో రోజు గురువారం జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి బయోలాజికల్ సైన్స్ పరీక్షకు 3,791 మంది హాజరు కాగా 2,054 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్మీయెట్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షకు 6,435 హాజరుకాగా 535 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,650 మంది హాజరుకాగా 143 మంది పరీక్ష రాయలేదని జిల్లా ఇంటర్మీయేట్ అధికారి జీజీకె.నూకరాజు తెలిపారు.

రాచూరి రాఘవేంద్ర స్వామి మృతి

బోట్‌క్లబ్: కాకినాడ మధ్వసభ కమిటీ అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్ర స్వామి (59) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. మధ్వసభ అధ్యక్షుడిగా ఆయన విశేష సేవలందించారు. ఆయన పార్థివ దేహానికి కమిటీ కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి పరశురామ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

ద్విచక్ర వాహనాల భాగాల చోరీ

కాకినాడ క్రైం: కాకినాడలోని ఓ బైక్ మెకానిక్ షాప్‌లో చోరీ జరిగింది. కాకినాడ టూ టౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్ తెలిపిన వివరాల మేరకు, నగరంలోని సినిమారోడ్‌లో రిలయన్స్ స్మార్ట్ ఎదురుగా ఉన్న లచ్చిరాజువారి వీధిలో కాలాడి శ్రీనివాస్ అనే వ్యక్తి గత 14 ఏళ్లుగా సీమోను ఆటోవర్క్స్ పేరుతో బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 20న ఉదయం షాపు తెరిచేందుకు వచ్చిన శ్రీనివాస్ తన షాప్‌లో పార్క్ చేసి ఉంచిన ఆరు ద్విచక్రవాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు స్పేర్ పార్టులు వేరు చేసి దొంగిలించి ఉండడాన్ని గమనించాడు. మెకానిక్‌గా అనుభవం ఉన్న వ్యక్తులే దొంగతనం చేసి ఉంటారని భావించి అనుమానం ఉన్న పలుచోట్ల గాలించాడు. ఫలితం లేకపోయే సరికి బుధవారం రాత్రి పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు చేశాడు. సీఐ నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం స్థానిక ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు లోబడి భజన, కోలాటం, శ్రీరామ నామజపంతో శోభాయాత్ర జరుగుతుందన్నారు. పట్టణ పురవీధుల గుండా పాదయాత్రతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత బైక్ ర్యాలీతో భారీ ఎత్తున శోభాయాత్ర ఉంటుందన్నారు.

వేసారే వేసవికి విరామ ఆరామాలు

- చిన్నారులకు ఆట విడుపు..
- వాకింగ్‌తో పెద్దల కాలక్షేపం
- రోజంతా తాపంతో అల్లాడుతూ సాయంత్రానికి పార్కుల్లో విడిది
- సందడి చేస్తున్న నగర, గ్రామీణ ప్రజలు



కాకినాడ 1వ డివిజన్ పద్మానగర్ పార్కులో చిన్నారుల ఆనంద హేల

కాకినాడ రూరల్: అసలే వేసవి.. ఆపై రోహిణి కార్తె.. ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదవుతున్నాయి. ఉదయం నుంచి ఒకటే ఉక్కపోత.. శరీరం నుంచి చమట ఏరులై పారుతున్నా కాస్త ఉపశమనం లభిస్తే చాలు తెగ సంబరపడిపోతున్నారు. నగరంలోని స్మార్ట్ పార్కులు చిన్నారులు నుంచి పెద్దలు వరకు వేసవి విడిదిలుగా మారాయి. రూరల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 8 డివిజన్లు ఉండగా సుమారు 16 పార్కులు ఉన్నాయి. స్మార్ట్ సిటీ నిధులతో పార్కులను అభివృద్ధి చేశారు. పెద్దలకు వాకింగ్ ట్రాక్‌లు, యువతకు కోర్టులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు ఊయలల నుంచి జారుడు బల్ల తదితర వాటిని ఏర్పాటు చేయడంతో ఇప్పుడు అవి వరంగా మారాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇళ్లలో ఉక్కిరి బిక్కిరవుతున్న జనాలు సాయం సంధ్యలో సరదాగా కాలక్షేపం చేసేందుకు పార్కులు బాట పడుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పార్కుల్లో సాయంత్రం నుంచి రాత్రి వరకు గడుతున్నారు. కాకినాడ ఒకటో డివిజన్ సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ పార్కులో ఉదయం, సాయంత్రం వాకింగ్ వచ్చే వారు ఉద్యానవనంలో సరదా కాలక్షేపం చేస్తున్నారు. వృద్ధులు సాయంత్రం అక్కడే కబుర్లతో గడుపుతున్నారు. 3వ డివిజన్‌లోని సురేష్ నగర్ పార్కులో ఎక్కువ మంది వాకింగ్‌తో కాలక్షేపం చేస్తున్నారు. 1వ డివిజన్‌లోని ఆర్టీసీ కాలనీ పార్కులో ఓపెన్ జిమ్‌తో పాటు వాకింగ్‌తో సందడి నెలకొంటుండగా పక్కనే పద్మానగర్ పార్కులో చిన్నారులు ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారు. పద్మానగర్ పార్కును సుమారు రూ.50 లక్షల నిధులతో అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు యువత షటిల్ ఓపెన్ కోర్టుతో కాలక్షేపం చేస్తుండగా చిన్నారులు మాత్రం ఊయలు ఊగుతూ, జారుడు బల్లపై జారుతూ సందడి చేస్తున్నారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఏర్పాటు చేసి జారుడు బల్ల ఆకట్టుకుంటోంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు పద్మానగర్ పార్కులో సందడిగా సాగుతోంది.

వేసవి సెలవుల్లో కాలక్షేపం



వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాం. ఎండ ఎక్కువగా ఉంటోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బయటకు రావడం లేదు. సాయంత్రం తీరికగా పార్కులో ఆడుకుంటున్నాం. భలే సరదాగా ఉంది.

– అప్పన వీరవెంకట సత్యనారాయణ, 7వ తరగతి విద్యార్థి, వలసపాకల

చక్కని అనుభూతి



వేసవి సెలవులు కావడంతో పెద్దమ్మ ఇంటికి వచ్చాను. తమ్ముళ్లతో సెలవులు ఎంజాయ్ చేస్తూ సాయంత్రం పద్మానగర్ పార్కులో ఆటపాటలతో గడుపుతున్నాం. చిన్నారుల కోసం జారుడు బల్ల, ఊయల, తదితర వాటిని ఏర్పాటు చేశారు. మంచి అనుభూతిని పొందాను.

– ఈసకోన రాము, 8వ తరగతి విద్యార్థి, అమలాపురం



పద్మానగర్ పార్కులో షటిల్ ఆడుతున్న యువకులు



జారుడు బల్లలపై చిన్నారుల సందడి

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



రికార్డుల్లో సంతకం చేస్తున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జేఎన్టీయూలో భద్రపరిచిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థకు సంబంధించిన కౌంటింగ్ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జె.నివాస్, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో ఉన్న ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ డి4 సెక్షన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి 9.10 గంటల వరకు లైన్ మరమత్తుల నిమిత్తం సర్పవరం విద్యుత్ సబ్–స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎ.ప్రసాద్ తెలిపారు. 11 కేవీ ఆశ్రమం స్కూల్ ఫీడర్, 11 కేవీ సర్పవరం ఫీడర్, 11 కేవీ సెట్రాజ్ ఫీడర్‌పై ఉన్న రమణయ్యపేట ఏరియా పరిధిలోని ఇందిరా కాలనీ, సర్పవరం జంక్షన్, ఏపీఐఐసీ కాలనీ, మురళీధర్ నగర్, గైగోలుపాడు, రాజేంద్ర నగర్, బాపన్నదొర కాలనీ, ఆంజనేయ నగర్, బాలాజీనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



అధ్యాపకులు, ప్రిన్సిపాల్‌తో 2006-08 బ్యాచ్ విద్యార్థులు

కాకినాడ రూరల్: స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ 2006–08 బ్యాచ్ ఇంగ్లిషు విభాగం పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయంగా కలుసుకున్నారు. నాటి ఆచార్యులు విశ్వనాథరావు, రాజేంద్ర కర్మాకర్, ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.ప్రశాంతిశ్రీ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ప్రశాంతి మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో ఉన్నప్పుడు ఇక్కడ చదివిన 2006–08 పూర్వ విద్యార్థులు ఇన్నేళ్లకు క్యాంపస్‌లో కలవడం హర్షణీయమన్నారు. అధ్యాపకులను గుర్తు పెట్టుకుని సన్మానించడం గొప్ప అనుభూతని ఆయన పేర్కొన్నారు. నాటి విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉంటూ క్యాంపస్‌కు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడం ముదావహమన్నారు. ఈ క్యాంపస్‌లో చదువుకున్న విద్యార్థులు ఎప్పుడు తమ బిడ్డల వంటి వారన్నారు.

గంగాధరానికి స్వరార్చన

- ఆర్కెస్ట్రా పితామహుడికి సంగీత నీరాజనం
- అలనాటి మేటి పాటలతో సంగీత విభావరి
- చప్పట్లు, ఈలలతో దద్దరిల్లిన సూర్యకళా మందిరం



సంగీత విభావరిని తిలకిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి



సంగీత విభావరిలో పాటలు పాడుతున్న శ్రీలలిత

బోట్‌క్లబ్: ఆర్కెస్ట్రా పితామహుడు దివంగత పెద్దిరెడ్డి గంగాధరం 86వ జయంతి సందర్భంగా గురువారం రాత్రి స్థానిక సినిమా రోడ్డులోని సూర్యకళామందిరంలో నిర్వహించిన స్వరార్చన ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పెద్దిరెడ్డి గంగాధరం చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1955లో ఆర్కెస్ట్రాను స్థాపించారన్నారు. ఎంతో మంది సంగీత కళాకారులను తయారుచేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. అంతే కాకుండా వివిధ రాష్ట్రాలు, దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారన్నారన్నారు. సంగీత విభావరిలో చెన్నైకు చెందిన ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ రాము, హైదరాబాద్‌కు చెందిన ప్లే బ్యాక్ సింగర్ శ్రీలలిత, బాబి తదితరులు అలనాటి మేటి పాటలను ఆలపించి ప్రేక్షకులను మైమరపించారు. అలనాటి పాటలు విన్న ప్రేక్షకులు ఈలలు, చప్పట్లతో సూర్యకళా మందిరం దద్దరిల్లిపోయింది.

కొంగతపము ఫలించిన వేళ..



ధర్మవరం రామభద్రరాజు చెరువులో దాహం తీర్చుకోవడానికి పోటీ పడుతున్న కొంగలు

ప్రత్తిపాడు రూరల్: ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. వారం రోజులుగా నియోజకవర్గంలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అత్యవసర పనులు ఉంటే మినహా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇక పశువులు, పక్షులు అయితే ఎండకు అల్లాడిపోతున్నాయి. ఒక పక్క ఎండ తీవ్రత, మరో పక్క తాగునీటి కొరతతో పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో అడుగంటిన రామభద్రరాజు చెరువులో తాగునీటి కోసం కొంగలు అల్లాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది. అడుగంటిన చెరువులో ఉన్న కొద్దిపాటి నీళ్లు సైతం ఎండ తీవ్రతకు వేడెక్కిపోయాయి. ఆ నీటినే తాగేందుకు కొంగలు పోటీ పడ్డాయి. ప్రస్తుత వేసవిలో తాగునీటికి పశువులు, పక్షులు పడుతున్న అవస్థలకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

ప్రేక్షకుల గుండెల్లో దాసరి స్థానం సుస్థిరం



దాసరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దాసరి యువశక్తి సభ్యులు, కళాకారులు

బోట్‌క్లబ్: సినీ రంగంలో ఒక శక్తిగా ఎదిగిన దాసరి నారాయణరావు ప్రేక్షకుల గుండెల్లో ఎప్పుడూ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దాసరి యువశక్తి అధ్యక్షుడు గోడి వెంకట్ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లో గురువారం దాసరి 7వ వర్ధంతి నిర్వహించారు. 150 కి పైగా సినిమాలకు దర్శకత్వం వహించి, 53 సినిమాలు నిర్మించారన్నారు. ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించారన్నారు. ఎంపీగా ఉన్న కాలంలో కాకినాడ నగరంలో ప్రభుత్వం స్కూళ్లలో ఆయన పేరుతో కళా వేదికలు నిర్మించి ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. కళాకారులు గుండోజు అరుణాకరరావు, చీపూరివెంకటరమణ మూర్తి, పట్నాల రామస్వామి, మురళీ కృష్ణ దాసరి నారాయణరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి నాగేశ్వరరావు, పాలవలస సత్యనారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, గునుపూరి రమణ, యండమూరి అప్పారావు పాల్గొన్నారు.

అల్లర్లకు తావులేకుండా చర్యలు

కిర్లంపూడి: వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపును దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో ఘర్షణలు, అల్లర్లకు తావు లేకుండా గ్రామస్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై–2 బలరాం, పంచాయతీ విస్తరణ అధికారి సత్యప్రసాద్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యవర ప్రసాద్, కార్యదర్శులు, వీర్వోలు పాల్గొన్నారు.

తిమ్మాపురం ఎస్సైపై తప్పుడు పోస్టు

- సోషల్ మీడియాలో హల్‌చల్
- ఖండించిన ఎస్సై రవీంద్రబాబు

కాకినాడ రూరల్: పోలీసుశాఖ క్రమశిక్షణకు మారుపేరు. సిబ్బంది గానీ, అధికారులు గానీ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే మొత్తం పోలీసు శాఖకు అపకీర్తిని తెచ్చిపెడుతుంది. అటువంటి మచ్చ జిల్లా పోలీసు శాఖకు ఆపాదించేలా తిమ్మాపురం ఎస్సై రవీంద్రబాబుపై గురువారం సోషల్ మీడియాలో పోస్టు హల్‌చల్ చేసింది. యూనిఫామ్‌తో ఉన్న ఎస్సై సిగరెట్ తాగుతూ కూర్చీలో కూర్చుని ఉండగా ఆయన ఎదురు సివిల్ డ్రెస్‌లో ఉన్న వ్యక్తి మద్యం బాటిల్‌తో కనిపించాడు. వీడియోలో ఎస్సై మద్యం సేవిస్తున్నట్టు లేనప్పటికీ ఆయన కోసం మద్యం బాటిల్‌తో మరో వ్యక్తి ఉన్నట్టుగా కనిపించడంతో అది తిమ్మాపురం స్టేషన్ అని, ఎస్సై స్టేషన్‌లో మద్యం, సిగరెట్ తాగుతున్నట్టు కొన్ని చానల్స్‌లో చూపారు. దీనిపై ఎస్సై రవీంద్రబాబు వివరణ కోరగా కావాలని కొందరు వ్యక్తులు తనపై విజయవాడలోని పాత వీడియోను వైరల్ చేసినట్టు తెలియజేశారు. 2021లో విజయవాడలో పనిచేస్తుండగా కాల్వలో రెండు కుళ్లి పోయిన మృత దేహాలు కొట్టుకురావడంతో వాటిని తీయించడానికి తీసుకువెళ్లిన వారికి మద్యం ఇచ్చి త్వరగా తీయమన్నామని, ఆ బాడీలను అప్పగించే క్రమంలో మార్చురీ వద్ద కూర్చుని ఉండగా దానిని కట్ చేసి వీడియోగా పెట్టారని, అయితే తిమ్మాపురం స్టేషన్ అంటూ పాత వీడియోలు పోస్ట్ చేయడం బాధకరమన్నారు. విజయవాడలో నమోదు చేసిన కేసులతో కావాలని తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిపై న్యాయపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. దీనిపై రూరల్ సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా తిమ్మాపురం ఎస్సైపై వచ్చిన ఆరోపణ విజయవాడకు సంబంధించినవన్నారు. ఇక్కడివి కాదన్నారు. 2024 జనవరిలో ఎస్సై రవీంద్రబాబు తిమ్మాపురంలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారన్నారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారన్నారు.

విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ

కొత్తపల్లి: విద్యార్థుల్లో సృజనాత్మకత, జ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని గ్రంథాలయ అధికారులు టి.జయకృష్ణ, టి.నళినీప్రియ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి శిక్షణ విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసాన్ని కలిగిస్తుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారించాలన్నారు. ప్రతిరోజు పుస్తక పఠనం చేస్తే మేధాశక్తి పెరుగుతుందన్నారు.



కర్ఫ్యూను తలపిస్తున్న రామచంద్రపురం వెళ్లే రహదారి



జన సంచారం లేని కరప-జి.మామిడాడ రహదారి

నెత్తిన నిప్పుల కుంపటి

- ఉష్ణతాపంతో అల్లాడుతున్న జనం
- దంచికొడుతున్న రోహిణికార్తె ఎండలు
- వడగాలులతో ప్రజల ఆపసోపాలు
- చల్లబడితే కానీ బయటకు రాలేని పరిస్థితి



కరపలో నిర్మానుష్యంగా ఉన్న మెయిన్‌రోడ్డు

కరప: ప్రచండ భానుడు ఉగ్రరూపానికి ప్రజలు గడగడలాడుతున్నారు. మధ్యలో రెండు రోజులు వర్షం పడినా ఐదు రోజులుగా కొనసాగుతున్న వడగాడ్పులకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. గురువారం నాటి ఎండలకు వృద్ధులు, పిల్లలు తాళెత్తారు. 41 నుంచి 44 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వడగాడ్పులు వీచి భయపెడుతున్నాయి. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దాదాపు రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పలు గ్రామాల్లో మధ్యాహ్నం 11 గంటలకే దుకాణాలు మూతపడుతున్నాయి. ఇళ్లపై వాటర్ ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది. రోహిణీ కార్తె ప్రారంభంలో చిరుజల్లులు పడి చల్లబడిందనుకుంటే ఆ తరువాత దాని ప్రతాపం చూపుతోందని ప్రజలు అంటున్నారు. నైరుతి రుతుపవనాలు రావాలని, వాతావరణం చల్లబడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నంతసేపు బయటకు రాకపోవడం మంచిదని కరప, వేళంగి పీహెచ్‌సీల వైద్యులు ఆర్.శ్రీనివాసనాయక్, ఎంకే సౌజన్య సూచిస్తున్నారు. విపరీతమైన తలనొప్పి, తీవ్రజ్వరం, మగతనిద్ర, లేదా కలవరింపులు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారకస్థితి ఉంటే వడదెబ్బ లక్షణాలుగా గుర్తించి వెంటనే ప్రాథమిక చికిత్స అందించాలని, వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చి, చల్లని గుడ్డతో శరీరాన్ని తుడిచి చల్లనిగాలి తగిలేలా చూసి వైద్యం కోసం దగ్గర్లోని ఆస్పత్రికి తరలించాలని చెప్తున్నారు.